భారీ వర్షం, వరదలు వచ్చాయంటే మారు మూల గ్రామాలకు రోజుల తరబడి రాకపోకలు నిలిచిపోతాయి. అక్కడ వాగులపై సరైన వంతెనలు లేక పోవటంతో సమస్య రావటం సహజం. అలాంటిది రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరానికి అనుకుని ఉన్న మున్సిపాలిటీలోని ఓ గ్రామానికి నెల రోజులుగా రాకపోకలు నిలిచిపోతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోతే ప్రభుత్వాలను, పాలకులను ఏమనాలో మీరే ఆలోచించండంటూ స్థానికులు దుమ్మెత్తి పోస్తున్నారు. ఈ సంవత్సరం గండిపేట చెరువు ఇప్పటికి ఎనిమిది సార్లు పూర్తి స్థాయి నీటి మట్టానికి చేరుకోవటంతో గేట్లు తెరిచారు. ఇలా కొన్నేళ్లుగా జరుగుతూనే ఉంది. అలా గేట్లు తెరచిన ప్రతి సారీ నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామ ప్రజలు మూసీ నదిని దాటేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి.
–మణికొండ


మంచిరేవుల వంతెన పైనుంచి ప్రవహిస్తున్న వరద

మంచిరేవులకు మూసీ గోస!

- నెల రోజులుగా తప్పని నరకయాతన
- వరద వస్తే రాకపోకలు బంద్
- అటకెక్కిన కొత్త వంతెన నిర్మాణం
- పట్టించుకోని పాలకుల తీరుపై సర్వత్రా నిరసన

లో లెవల్ వంతెనలతో ఇబ్బందులు

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రం నుంచి గ్రామానికి రాకపోకలు సాగించేందుకు దశాబ్దాల క్రితం నిర్మించిన లో లెవల్ వంతెన ఉంది. గండిపేటలో ఆరు గేట్లు ఎత్తారంటే నీరు దానిపై నుంచి ప్రవహిస్తుంది. దాంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి.

మరో రెండు చోట్ల అదే పరిస్థితి...

నార్సింగి మున్సిపాలిటీ కేంద్రానికి అనువుగా ఉన్న దగ్గరి దారి మూసి వేస్తే పక్కనే ఉన్న ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీసు రోడ్డులో రాకపోకలు సాగించేందుకు వీలు ఉండేది. మరింత వరద పెరగగానే దాన్నీ మూసి వేస్తున్నారు. రాయల్ ఫంక్షన్ హాల్ వద్ద నుంచి ఉన్న మరో దారి పరిస్థితీ అలాగే మారింది. గ్రామానికి ఇటువైపుగా ఉన్న మూడు దారులను మూసి వేస్తుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చేసేది లేక కిలోమీటరు దూరం ఉన్న నార్సింగికి మంచిరేవుల నుంచి పోలీస్ అకాడమీ, బండ్లగూడ, టిప్పుఖాన్ బ్రిడ్జిల మీదుగా 15 కిలోమీటర్లు తిరిగి నార్సింగికి రాకపోకలు సాగించాల్సి వస్తున్నదని గ్రామస్తులు వాపోతున్నారు.


ఔటర్ సర్వీసు రోడ్డు...



పడరాని పాట్లు...

మంచిరేవుల గ్రామస్థులు పక్కనే ఉన్న నార్సింగికి వచ్చి పోయేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం ప్రారంభం కానున్న మూసీ రివర్ ఫ్రంట్ అభివృద్ధి పనుల్లో మంచిరేవులకు అవసరమైన రెండు వంతెనల ఎత్తు పెంచి కొత్తవి నిర్మించాలని కోరతాం. మూసీ పునరుజ్జీవ ప్రాజెక్టులో చేయకపోతే సంవత్సరాలు గడిచినా సమస్య అలాగే ఉంటుంది. త్వరలోనే ఎమ్మెల్యే, మూసీ ప్రాజెక్టు అధికారులను కలిసి వివరిస్తాం. – కె.దశరథయాదవ్, వైస్ చైర్మన్, నార్సింగి మార్కెట్ కమిటీ


తక్కువ ఎత్తులో ఉన్న మంచిరేవుల-నార్సింగి వంతెన

మొదలు కాని పనులు...

మూసీ నదిపై పాత వంతెనలకు తోడుగా మరో ఆరు చోట్ల కొత్త వంతెనలను నిర్మించాలని గత బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతిపాదనలను సిద్ధం చేసింది. రూ. 150 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ వాటిని నిర్మించేందుకు టెండర్లను సైతం పిలిచారు. వాటిలో హైదర్‌షాకోట్ నుంచి ఇబ్రహీంబాగ్, మంచిరేవుల నుంచి రాయల్ ఫంక్షన్‌హాల్, మంచిరేవుల నుంచి నార్సింగికి వచ్చే రోడ్ల వద్ద కొత్తవి ఎత్తులో నిర్మించాలని నిర్ణయించారు. అప్పట్లో నిధుల లభ్యత లేకపోవటంతో పనులను చేపట్టలేక పోయారు. ప్రస్తుత ప్రభుత్వం వచ్చి రెండు సంవత్సరాలు గడుస్తున్నా హైదరాబాద్ నగర శివార్ల రోడ్లు, వంతెనలపై అసలు దృష్టి పెట్టకపోటం పట్ల నిత్యం ప్రజలు విమర్శల వర్షం కురిపిస్తున్నారు. ఇలాంటి పనులను ప్రభుత్వం, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధులను రాబట్టాల్సిన ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పట్టించుకోకపోవటం పట్ల అటుగా రాకపోకలు సాగిస్తున్న ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కొత్త వంతెన నిర్మించాలి



ఎడతెరపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పలుమార్లు గండిపేట రిజర్వాయర్ గేట్లను తెరవటంతో మంచిరేవుల, నార్సింగిల మధ్య ఉన్న మూడు వంతెనలను మూసి వేస్తున్నారు. దాంతో నార్సింగికి వెళ్లిరావాలంటే పడరాని పాట్లు పడాల్సి వస్తున్నది. ప్రభుత్వం చర్యలు తీసుకుని కొత్త వంతెన నిర్మించాలి. – డి.లక్ష్మణ్, మాజీ వార్డు సభ్యుడు, మంచిరేవుల

అటకెక్కిన వంతెన పనులు



బీఆర్ఎస్ పాలనలో మంచిరేవుల వాసుల సమస్య తీర్చేందుకు కొత్త వంతెనల నిర్మాణానికి టెండర్లు పిలిచారు. అయితే ప్రభుత్వం మారటంతో ఆ పనులు కాస్తా అటకెక్కాయి. రోడ్లు, వంతెనల నిర్మాణాలను ఎప్పటికపుడు చేపట్టాల్సిన పాలకులు వాటిని విస్మరించారు. – కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బీఆర్ఎస్ అధ్యక్షుడు, నార్సింగి మున్సిపాలిటీ

ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తా...



నెల రోజులుగా మంచిరేవుల వాసులు నార్సింగికి వచ్చేందుకు 15 కిలోమీటర్ల దూరం తిరిగి రాకపోకలు సాగిస్తున్నారు. అనుకూలమైన రోడ్లు ఉన్నపుడే గ్రామం అన్ని విధాలా అభివృద్ధి చెందుతుంది. ఇన్ని రోజులుగా సమస్య పరిష్కారానికి నోచుకోకపోవటం దారుణం. ఈ విషయాన్ని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ దృష్టికి తీసుకుని వెళ్లి నిధులను రాబట్టాలని కోరతాము. – ఎం.నాగపూర్ణ శ్రీనివాస్, మాజీ చైర్‌పర్సన్, నార్సింగి


దిగువకు ఉన్న రాయల్ ఫంక్షన్‌హాల్ రోడ్డు వంతెన

పరిశుభ్రతపై అవగాహన పెంచుకోవాలి

మైలార్‌దేవ్‌పల్లి: రాజేంద్రనగర్ సర్కిల్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలో గురువారం జీవీపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమాన్ని జీహెచ్ఎంసీ శానిటేషన్ సూపర్‌వైజర్ శేఖర్, సంగీత, సీవో విజయేందర్ ఆధ్వర్యంలో చేపట్టారు. ఈ సందర్భంగా సిబ్బంది సమన్వయంతో ప్రాంతంలో చెత్త, చెదారం తొలగింపు పనులు చేపట్టారు. మైలార్‌దేవ్‌పల్లి ప్రధాన వీధులు, కాలనీలలో చెత్త పేరుకుపోకుండా శుభ్రత చర్యలు చేపట్టారు. ప్రజలు నిర్దేశిత స్వచ్ఛ ఆటోల్లోనే చెత్త వేయాలని అధికారులు సూచించారు. తడి, పొడి చెత్తను విడిగా వేరు చేయాలని అవగాహన కల్పించారు. చెత్త వేయెద్దు అని సూచిస్తూ ప్రదేశంలో ముగ్గుతో హెచ్చరికలు జారీ చేశారు. పరిశుభ్రమైన పరిసరాలు సమాజ ఆరోగ్యానికి బాటలు వేస్తాయని అధికారులు తెలిపారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత, ప్రతి ఒక్కరూ శుభ్రతపై శ్రద్ధ చూపాలని ఈ దిశగా అవగాహనను పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్పీలు మణెమ్మ, జయంతి, నర్మల, అమీనాబీ, ప్రమీల, హేమలత పాల్గొన్నారు.

రేషన్ షాపుల్లో నాణ్యమైన బియ్యం పంపిణీ

రాజేంద్రనగర్ ఏఎస్‌వో పుల్లయ్య

అత్తాపూర్: రేషన్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరికీ జాతీయ ఉత్పత్తి పంపిణీ పథకం ద్వారా నాణ్యమైన బియ్యం సరఫరా చేస్తున్నామని రాజేంద్రనగర్ ఏఎస్‌వో పుల్లయ్య తెలిపారు. రేషన్ సరఫరాలో షాపుల్లో ఎలాంటి అక్రమణలకు తావు లేకుండా ఐరిష్ విధానాన్ని నూతనంగా ప్రవేశపెట్టామని ఆయన తెలిపారు. ప్రతి నెల రాజేంద్రనగర్ అత్తాపూర్, హైదర్‌గూడ, సిక్‌చానీ, రాంబాగ్, బుద్వేల్, శివరాంపల్లి, గగన్‌పహాడ్, మైలార్‌దేవ్‌పల్లి, లక్ష్మీగూడ తదితర ప్రాంతాలలో ఉన్న రేషన్ దుకాణాలలో సరఫరాలో ఎలాంటి అంతరాయం లేదన్నారు. ప్రభుత్వం అందజేస్తున్న నాణ్యమైన బియ్యాన్ని ఎంతో సంతోషంతో తీసుకుంటున్నారని ఆయన వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో కార్డు ఉన్న వినియోగదారుడు రాష్ట్రంలోని ఏ ప్రాంతం నుంచి అయినా సరుకులు పొందవచ్చని ఆయన సూచించారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి


క్రీడాకారుల పరిచయ కార్యక్రమంలో ఎంఈవో సునీల్‌కుమార్

బండ్లగూడ: విద్యార్థులు చదువుతో పాటు క్రీడలకు తగిన సమయాన్ని కేటాయిస్తూ ఔత్సాహిక క్రీడల్లో రాణించాలని గండిపేట మండల విద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. 69వ ఎస్‌జీఎఫ్ గండిపేట మండల క్రీడాకారుల ఎంపిక పోటీలు గురువారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన పోటీలను ప్రారంభించారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలలో క్రీడాకారులు తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ మండల స్థాయిలో ఎంపికైన విద్యార్థులు త్వరలో జరగబోయే జోనల్ టోర్నమెంట్‌లో గండిపేట మండలాన్ని ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. ఈ క్రీడలను నిర్వహించడానికి, విజయవంతం చేయడానికి సహకరించిన డాన్ బాస్కో యజమాన్యానికి, మండల వ్యాయామ ఉపాధ్యాయులకు మండల ఇన్‌చార్జి ఎస్.జ్యోత్స్న అభినందనలు తెలిపారు. ఎంపిక పోటీల్లో మొత్తం వివిధ పాఠశాలల నుంచి 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారు.

నియామకం



బండ్లగూడ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఎస్సీ విభాగం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడిగా బండ్లగూడ జాగీర్ మాజీ సర్పంచ్ గంగని హరికృష్ణ నియమితులయ్యారు. ఈ మేరకు నియామకపత్రాన్ని గురువారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ నగరి ప్రీతం, ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్‌ముదిరాజ్‌ల చేతుల మీదుగా ఆయన అందుకున్నారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి తనవంతు సాయశక్తుల కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి అర్హులైన ప్రతి ఒక్కరికి అందేలా చూస్తానన్నారు. తెలంగాణ ఎస్సీ విభాగం వైస్ చైర్మన్ జల్‌పల్లి నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

దశలవారీగా సమస్యల పరిష్కారం

రాయదుర్గం: గోపన్‌పల్లిలో త్వరలోనే పర్యటించి దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తామని ఎమ్మెల్యే గాంధీ స్పష్టం చేశారు. గురువారం గచ్చిబౌలి కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి ఆధ్వర్యంలో గోపన్‌పల్లివాసులు ఎమ్మెల్యేను కలిసి స్థానిక సమస్యలను వివరించి పరిష్కరించాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ అవసరమైన చోట రోడ్లు, యూజీడీ పైప్‌లైన్‌లు ఏర్పాటు చేయిస్తామన్నారు. అంసపూర్తి రోడ్డు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు గౌతమ్‌గౌడ్, దాత్రినాథ్‌గౌడ్, యాదగిరిగౌడ్ అనిల్, నర్సింహ, శ్రీరామ్‌రెడ్డి, నర్సింగ్ రావు, సత్యనారాయణ, జితేందర్, రాజేందర్, కాలనీవాసులు పాల్గొన్నారు.

26, 27వ తేదీల్లో మధ్యాహ్న భోజన పథకం

కార్మిక రాష్ట్ర మహాసభలు



మైలార్‌దేవ్‌పల్లి: తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని ఆహ్వాన సంఘం చైర్మన్ పగడాల యాదయ్య కోరారు. రంగారెడ్డి జిల్లా సీఐటీయూ కాటేదాన్ ఆఫీస్‌లో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 26 ,27వ తేదీలలో ఇబ్రహీంపట్నంలో ఈ రాష్ట్ర మహాసభ జరుగుతుందన్నారు. ఈ సభలో రాష్ట్రవ్యాప్తంగా నలుమూలల నుంచి మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొంటారన్నారు. తెలంగాణ రాష్ట్రంలో సుమారు 54 వేల పైచిలుకు కార్మికులు ఉన్నారన్నారు. వారి సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. పెరిగిన ధరలతో పోలిస్తే గతంలో కేటాయించిన బడ్జెట్ సరిపోవడం లేదన్నారు. ధరల పెరుగుదలతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం స్పందించి వారికి న్యాయం చేయాలన్నారు. ప్రభుత్వ హామీ ప్రకారం రూ. 10 వేల వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు వై.స్వప్న, సీఐటీయూ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి ఎం.చంద్రమోహన్, ఉపాధ్యక్షులు జాజాల రుద్రకుమార్, జిల్లా మధ్యాహ్న భోజన యూనియన్ ఉపాధ్యక్షులు గణేష్, జిల్లా ఆఫీస్ బేరర్స్ శిరీష, రాధా, పరమేశ్వరి, అరుణ తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి

- ఆటో ప్రయాణికుల భద్రతే లక్ష్యం కావాలి
- సైబరాబాద్ అదనపు డీసీపీ హన్మంత్‌రావు

మణికొండ: ప్రయాణికులకు పూర్తి స్థాయిలో భద్రత కల్పించటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను తప్పక పాటించాలని సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ అదనపు డీసీపీ జి.హన్మంత్‌రావు అన్నారు. నార్సింగి మున్సిపాలిటీ, గొలిదొడ్డిలోని ప్రధాన్ కన్వెన్షన్‌లో గురువారం గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆటో డ్రైవర్‌లతో నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఆటో డ్రైవర్‌లు తప్పనిసరి యూనిఫామ్ ధరించాలని, ఆటోకు సంబంధించిన అన్ని పత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ, మద్యం సేవించి ఆ మత్తులో డ్రైవింగ్ చేయవద్దని, ఆటో ప్రయాణం సుఖవంతంగా ఉంటేనే ప్రయాణికులు ఆదరిస్తారన్నారు. రోడ్లపై కేటాయించిన స్టాండ్‌లలోనే ఆటోలను నిలపాలని, ఎక్కడ పడితే అక్కడ నిలిపినా, ట్రాఫిక్ జాంలకు, ప్రమాదాలకు కారణమైతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రాబోయే రోజుల్లో ఆటో డ్రైవర్‌లపై ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తామని, అందులో ఎలాంటి తప్పులు దొరకకుండా చూసుకోవాలని సూచించారు. మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ కె.చంద్రశేఖర్‌రెడ్డి, అదనపు ఇన్‌స్పెక్టర్ జి.లవకుమార్, ఎస్ఐ వీరబ్రహ్మం, ఎస్ఐలు, 200 మంది ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



పేద విద్యార్థులకు అండగా ఉంటాం

ఐడీబీఐ బ్యాంక్ ప్రాంతీయ కోఆర్డినేటర్ కునాల్



మణికొండ: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న పేద విద్యార్థులకు తమ వంతుగా అండగా ఉంటామని ఐడీబీఐ బ్యాంక్ ప్రాంతీయ కో ఆర్డినేటర్ కునాల్ అన్నారు. మణికొండ మున్సిపాలిటీ, నెక్నాంపూర్ ప్రాథమిక పాఠశాలకు బ్యాంక్ సీఎస్ఆర్ నిధులు రూ. 2 లక్షలతో కంప్యూటర్ టేబుల్‌లు, కుర్చీలు, క్లాస్ రూం రాక్‌లు, లైబ్రరీ రాక్‌లు, ఆఫీస్ టేబుల్‌లు, కుర్చీలను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ... తమ బ్యాంక్ తరపున ప్రతి సంవత్సరం సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలలు, మరుగుదొడ్లు, తదితర సౌకర్యాలను కల్పించేందుకు పెద్ద పీట వేస్తున్నామన్నారు. విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉన్న చోట అదనపు తరగతులను నిర్మించామన్నారు. మణికొండ మున్సిపల్ మాజీ చైర్మన్ కె. నరేందర్ ముదిరాజ్, మాజీ వైస్ చైర్మన్ కె.నరేందర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ కె.రామకృష్ణారెడ్డి, బ్యాంక్ మేనేజర్ జయకుమార్, బ్యాంక్ రీజనల్ అధికారులు అఖిలేష్, జైసింగ్, ప్రధానోపాధ్యాయుడు మహ్మద్ అనీస్ తదితరులు పాల్గొన్నారు.

బ్రెస్ట్ కేన్సర్‌పై అవగాహన



మాదాపూర్: మహిళల్లో కేన్సర్‌పై అవగాహన పెంపొందించి ప్రారంభదశలోనే గుర్తించాలని గైనకాలజిస్టు డాక్టర్ ఎల్. జయంతిరెడ్డి తెలిపారు. మాదాపూర్‌లోని మెడికవర్ ఆసుపత్రిలో గురువారం బ్రెస్ట్ క్యాన్సర్ అవగాహన నెల సందర్భంగా ఉచిత క్యాన్సర్ స్క్రీనింగ్ కూపన్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేన్సర్‌ను ప్రారంభ దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాలు రక్షించవచ్చని తెలిపారు. ఉచిత స్క్రీనింగ్ కూపన్లు అక్టోబర్ 31 నుంచి మెడికవర్ కేన్సర్ హాస్పిటల్‌లో అందుబాటులో ఉంటాయని తెలిపారు. బ్రెస్ట్ కేన్సర్ పరీక్ష, పాప్‌స్మియర్, కంప్లీట్ బ్లడ్ పిక్చర్ తదితర పరీక్షలు ఉచితంగా చేస్తారని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సబిత తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నేతల ముందస్తు అరెస్టులు

బండ్లగూడ: నగరంలో ఆర్టీసీ టికెట్ ధరల పెంపునకు నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చలో బస్ భవన్ పిలుపు నేపథ్యంలో మాజీ శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్‌ను రాజేంద్రనగర్ పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కిస్మత్‌పూర్‌లోని ఆయన నివాసంలో అరెస్టు చేశారు. ఆయనతో పాటు కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు నాగరాజు, బీఆర్ఎస్ పార్టీ నాయకులను అరెస్టు చేశారు. పెంచిన ఆర్టీసీ చార్జీలను తగ్గించాలని కోరుతూ బీఆర్ఎస్ పార్టీ బస్ భవన్ కార్యక్రమానికి పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా స్వామిగౌడ్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలపై పోరాడుతున్న తమను హౌస్ అరెస్టు చేయడం భావ్యం కాదన్నారు. ప్రభుత్వం ఇకనైనా స్పందించి పెంచిన చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేశారు.


పోలీస్ స్టేషన్‌లో అత్తాపూర్ నాయకులు...


మైలార్‌దేవ్‌పల్లి పీఎస్‌లో అధ్యక్షుడు వెంకటేష్ తదితరులు

మణికొండ పరిధిలో...

మణికొండ: హైదరాబాద్ నగరంలో పెంచిన ఆర్టీసీ బస్ చార్జీలను తగ్గించాలనే డిమాండ్‌తో గురువారం బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు చలో బస్ భవన్ కార్యక్రమం చేపట్టడంతో ఆ పార్టీ నాయకులను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు. బీఆర్ఎస్ పార్టీ నార్సింగి మున్సిపాలిటీ అధ్యక్షుడు కె.విష్ణువర్ధన్‌రెడ్డి, బండ్లగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజులను నార్సింగి పోలీసులు అరెస్టు చేశారు. మధ్యాహ్నం వరకు పోలీస్‌స్టేషన్‌లో ఉంచుకుని విడుదల చేశారు. మణికొండ మున్సిపాలిటీ అధ్యక్షుడు డి.సీతారాం ఆధ్వర్యంలో పార్టీ నాయకులు మాజీ మంత్రి టి.హరీష్‌రావు ఇంటికి వెళ్లి అక్కడి నుంచి బస్‌భవన్‌కు తరలి వెళ్లారు.

రాష్ట్రంలో నియంతృత్వ పాలన...

అత్తాపూర్: తెలంగాణ రాష్ట్రంలో నియంతృత్వ పాలన కొనసాగుతోందని బీఆర్ఎస్ పార్టీ అత్తాపూర్ డివిజన్ నాయకుడు అప్పారెడ్డి ముఖేష్ ఆరోపించారు. పార్టీ నాయకులను అత్తాపూర్ పోలీసులు హౌస్ అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. నాయకులు పుప్పాల లక్ష్మణ్, పాశం నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.


శాసన మండలి మాజీ చైర్మన్ స్వామిగౌడ్‌ను హౌస్ అరెస్టు చేస్తున్న పోలీసులు

ఇందిరమ్మ పాలన అంటే అక్రమ అరెస్టు లేనా?

మైలార్‌దేవ్‌పల్లి: ఇందిరమ్మ పాలన అంటే అక్రమ అరెస్టులేనా అని బీఆర్ఎస్ మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. పెంచిన ఆర్టీసీ బస్సు చార్జీలకు నిరసనగా తలపెట్టిన చలో బస్ భవన్ కార్యక్రమానికి వెళ్లనియ్యకుండా బీఆర్ఎస్ నాయకులను మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ... రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి నిర్బంధ పాలన కొనసాగుతున్నదన్నారు. ప్రశ్నించే గొంతుకలను నొక్కాలని పాలకులు కుట్రలు చేస్తున్నారన్నారు. పార్టీ సీనియర్ నాయకులు గుమ్మడి కుమార్, ఎడ్లకాడి సూర్యం, గోల్కొండ లేవిరాజ్, నాని, చంద్రశేఖర్, గౌతమ్, శేఖర్, నరేష్, శ్రీకాంత్, ఈశ్వర్, రఘుయాదవ్, జగన్‌ముదిరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.